# గెలుపు

'మధ్యాహ్నం మీ కేదో ఉత్తరం వచ్చిందండీ! ఆ డ్రాయరు మీద ఉంచేను తీసుకోండి.!" అంటూ పార్వతి, వంట గది అనబడే తడికెల చాటు నుంచి అరిచింది. కాఫీ గ్లాసు టేబిలు మీద ఉంచి, ఉత్తరం తీసాను. కవరు మీద అడ్రసు చూడగానే ఎవరు రాసేరో తెలిసి పోయింది. ఆ దస్తూరీతో నాకు గతంలో కొన్నేళ్ళ పరిచయం ఉంది మరి!

"పారూ! వాసు గాడు ఉత్తరం రాసాడే!" అని అరిచేను, ఆనందం పట్టలేక. చేతులు కొంగుకి తుడుచు కుంటూ వచ్చి, ద్వారాన్ని ఆనుకుని నిల్చుంది పార్వతి. ఆత్రంగా ఉత్తరం విప్పి చదివాను. ముత్యాల్లాంటి అక్షరాల్లో ఆప్యాయతని అద్ది రాసాడు వాసు.

"రామం అనబడే ఇడియట్‌కి,

ఎన్నేళ్ళయిందిరా, నిన్ను చూసి! బాగున్నావా! లేక యింకా అప్పటి లాగే ఉ న్నావా! నిన్ను హైస్కూల్లో అంతా స్కెలిటినని ఏడిపించే వాళ్ళు కదూ?! ఓ సారి కామేశం గాడు నిన్ను 'ఒరే, రమణా రెడ్డి తమ్ముడూ!' అని పిలిచేడని కళ్ళలో నీళ్ళు కుక్కు కున్నావు. నిన్ను చూసి, అప్పుడు నాకు బలే జాలి వేసింది. ఆ రోజు సాయంత్రం అంబటి సత్రం దగ్గర బీటు వేసి, కామేశం గాడిని తంతానని బెదిరించి నీకు క్షమాపణలు చెప్పించాను. "నీకు గుర్తుందా! ఓ రోజు అయ్య కోనేరు గట్టు మీద చేపలు పట్టే కుర్రాడికీ నీకూ ఎందుకో మాటా మాటా వచ్చి నప్పుడు నేను తమాషాకి ఆ కుర్రాడి పక్షం చేరి నీతో వాదిస్తే నీకు చాలా కోపం వచ్చింది. నాతో మట్లాడటం కూడా మానీసేవు! "గెలుపు నాదే అప్పుడు! నువ్వే కదూ, ముందు వచ్చి మాట్లాడీసేవు?

"హైస్కూల్లో సెక్రటరీగా నాకు ప్రతిగా పోటీ చేసి నువ్వు చిత్తుగా ఓడి పోయేవు. అప్పుడు మళ్ళీ నా మీద నీకెంత కోపం వచ్చిందని! సరదా కోసం ఇద్దరం ఎదురెదురుగా పోటీ పడ్డాం. నువ్వు మాత్రం మన నిబంధనని మరిచి పోయి, అపజయాన్ని తీవ్రంగా తీసుకున్నావు. "అవేళ, నీకు గుర్తుందా!... నన్ను కవ్వించేవు. దమ్ముంటే అయోధ్యా మైదానం దగ్గరకి నిన్ను ఎదుర్కోడానికి రమ్మన్నావు. నీతో పోటీకి నేనెప్పుడూ సిద్ధమే! నాకు తెలుసు. గెలుపు నాదే! రాస్కెల్... అప్పుడే ఉడుక్కుంటున్నావు కదూ? "అంత వరకూ మనిద్దరం ఎంతో స్నేహంగా ఉండి, ఏదో చిన్న గొడవల్లో పడి, కొట్టుకోడానికి సిద్ధ పడి పోయేమన్న వార్త స్కూల్లో అందరి చెవుల్లోనూ పడి పోయింది. అంతా వింత చూడాలని, ఆశతో అయోధ్యా మైదానం దగ్గరకి వచ్చేరు. "వింతే చూసారు! "ఆ రోజు నీ చెయ్యి దొరక బుచ్చుకుని గట్టిగా షేక్ చేసి, నీ చెవిలో ఓ విషయం చెప్పాను. అదేమిటో, యివాళ నీకు జ్ఞాపకముం ఉందా, రామం?" ఉత్తరం చదవడం ఆపేను. నా వొళ్ళు ఎందుకో గిలిగింతలు

పెట్టినట్టయింది. కళ్ళలో చప్పున ఆనందంతో నీళ్ళు తిరిగాయి. టప టపమని ఉత్తరం మీద పడ్డాయి.

ఆ వేళ మా దొమ్మలాట వింతగా చూడాలని ఆశతో వచ్చిన విద్యార్థులందరి ముందూ, నా చెయ్యి దొరక పుచ్చుకుని, ఆప్యాయంగా నిమిరి, బలంగా షేక్ చేసి ... నా చెవిలో వాడు చెప్పిన విషయం నాకు బాగానే గుర్తుంది. దాన్ని ఎలా మరిచి పోగలను! "పిచ్చి రామం! ఎందుకయ్యా అంత కోపం? నాలో రెండున్నర ప్రాణాలున్నాయి. నీలో రెండున్నర ప్రాణాలున్నాయి. పంచప్రాణాలూ కలిసి ఎప్పుడేనా కలహించు కుంటాయా!" అప్పుడేదో అదృశ్య హస్తం నా గుండెని గిలి గింతలు పెట్టినట్టయింది. నన్ను చూసి నేనా రోజు ఎంత సిగ్గు పడ్డానని! ఆ నాటి వాడి మాటలలో సున్నితమైన హాస్యం నాకీనాటికీ ఆహ్లాద పరుస్తూనే ఉంటుంది. వాసు స్కూటరు ఎక్కి స్టార్టు చేసాడు. నేను వెళ్ళి వెనక సీట్లో కూచున్నాను. స్కూటరు మినర్వా థియేటరు వేపు దారి తీసింది! ఈ వింత చూసి, చాలా మంది విద్యార్థులు ఆశ్చర్య పోయే ఉంటారు!

కళ్ళలో నీళ్ళు తిరగడం వల్ల ఉత్తరం మీద అక్షరాలు అలుక్కు పోయి నట్టయి , కనిపించడం లేదు. తప తపమని రెండు మూడు సార్లు కను రెప్పలు ఆడించడంతో అక్షరాలు స్పష్టమయ్యాయి. పార్వతి గుమ్మం దగ్గర నిల్చుని ఉంది. లేకుంటే, చేత్తోనే తుడుచుకునే వాడిని. ఉత్తరం తిరిగి చదవడం మొదలెట్టాను.

"మైడియర్ యంగ్ ఫెలో! సంస్కృత కళాశాలలో మామిడి చెట్లు నాకింకా బాగా గుర్తున్నాయి. ఆ పుల్ల పుల్లని కాయల్ని, ఉప్పూ కారంలో అద్దుకుని తింటూ ఉంటే వాటి రుచినీ, ఈ తోడు దొంగల్ని మందలించే వేద పండితుల్నీ నేనెప్పటికీ మరిచి పో లేనారే!

"కూడలి మధ్య ఛాతీ విరుచుకుని నిలబడిన వస్తాదులా, ఎత్తయిన గంటస్తంభాన్నీ, మూడు లాంతర్ల దగ్గర ఎనామిల్ పెయింట్‌తో మెరిసి పోయే మూడు సింహాల బొమ్మనీ, సంగీత కళాశాల ప్రశాంత వాతావరణాన్నీ - ఎలా మరిచి పోగలను చెప్పు! "రాజు గారి కోటలో మసిలి బంట్రోతు కొట్టే గంటల ధ్వని, నాచెవుల్లో యిప్పటికీ ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది! ఏనుగు అంబారీలా, మచ్చ కొండ మీద ఆ తెల్లని మచ్చ నాకెప్పటికీ అబ్బురమే! ఎర్ర కోనేట్లో గణేష్ నిమజ్జనోత్సవం, పైడి తల్లి అమ్మ వారి కోవెలలో యిచ్చే వేడి వేడి ప్రసాదాలూ, మంచి వాడి గుండెంత విశాలమైన అచ్చెరువు గొలిపే పెద్ద చెరువూ... ఏవో పురాతన రహస్య సంకేతాలు వినిపిస్తున్నట్టు - రాజు గారి కోట బురుజుల మీద పావురాళ్ళ కువ కువలూ... మార్వాడీ పాల కోవా ఘుమ ఘుమలతో చవులూరించే కస్పా బజారూ, దాసు గారి దివ్య స్మృతులని గుర్తు చేస్తూ గుమ్చీ, మూడు కోవెళ్ళూ... "ఓహ్!... ఎన్ని అందమైన జ్ఞాపకాలు!... అబ్బ! అప్పుడే రాత్రి రెండయింది. ఎంతకీ నిద్ర రావడం లేదు. నిన్ను ఈ క్షణంలోనే చూడాలనీ, బలంగా తనివితీరా కౌగలించు కోవాలనీ, నీతో మన చిన్న నాటి ముచ్చట్లు గంటల తరబడి మాట్లాడాలనీ ...

"ఎన్నెన్ని కోరికలు! "ఈ ఆదివారం హైదరాబాద్ - పూరీ ఎక్స్ ప్రెస్‌లో విజయనగరం వస్తున్నాను. కానైతే, సాయంత్రమే తిరిగి వెళ్ళి పోవాలి. రాయగడలో మా పెద్దమ్మాయి యింటికి వెళ్ళాలి. "ఉంటాను, మరి. మీ శ్రీమతిని అడిగానని చెప్పు. పిల్లలకి దీవెనలు. ఎలాగూ రాబోతూ కూడా ఉత్తరంలో ఎన్ని కబుర్లు చెప్పానో చూశావా! "ఆ ఒక్క రోజు ఆనందంగా గడుపుదాం, ఏం?

నీ, వాసు."

"ఆదివారం వాడు వస్తున్నాడుట పార్వతీ!" అన్నాను. గొంతులో యింతకు ముందున్న ఉత్సాహం ఎంచేతో తగ్గింది. "అబ్బ! వాడ్ని చూసి ఎన్నాళ్ళయిందో!" అన్నాను ఉత్సాహం తెచ్చు కోడానికి ప్రయత్నిస్తూ. పార్వతి చిన్నగా నవ్వి, వంట గది లోకి వెళ్లి పోయింది. నేను చిన్నగా నిట్టూర్చాను. వాసు! ఎన్నాళ్ళకి తిరిగి కలుసుకో గలుగుతున్నాం! మేమిద్దరం మంచి స్నేహితులం. అప్పుడప్పుడు చిన్న చిన్న భేదాభి ప్రాయాలు వచ్చినా, తిరిగి కలిసి పోయే వాళ్ళం. అక్కన్న మాదన్నలనే వాళ్ళు, మమ్మల్ని! వాసు నా రక్తం. నేను వాడి జీవం. నేను వాడి రక్తం. వాడు నా జీవం. వాసు గొప్పింటి బిడ్డ. తెలివైన వాడు. స్కూల్లో అందరి అభిమానమూ చూరగొన్న విద్యార్థి. హైస్కూలు చదువు పూర్తి కాగానే, వాసు పై చదువుల కోసం వాళ్ళ కుటుంబం విజయనగరం నుండి హైదరాబాద్ వెళ్ళి పోయింది. అక్కడే పి.యూ.సీ చదివాడు. ఆ పైన ఇంజనీరయ్యేడు. తర్వాత ఏదో వ్యాపారంలో పడ్డాడు. నేను ఇక్కడే గవర్నమెంటాఫీసులో క్లార్కుగా స్థిర పడ్డాను.

మొదట్లో మా మధ్య తరుచుగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగినా, రాను రాను తగ్గి పోయేయి. నా వివాహం వేళకి, విశాఖ పట్నం వస్తే, మాతో విజయనగరం రమ్మని ఎంతో చెప్పాను. తీరిక లేదనీ, మరో మారు వస్తాననీ వెళ్ళి పోయేడు. ఉత్తరాలు రాయడం లేదేమని మందలిస్తే, వాడు చెప్పిన మాట నాకు గుర్తే! "కోప్పడకొరే! నీకు పుణ్యం ఉ ంటుంది. ఉత్తరాల్లో ఏముందిరా పిచ్చి నాన్నా! నా సంగతి నీకు తెలుసు కదా? ఉత్తరం రాయాలంటే పరమ బద్ధకం. పైగా, తీరిక లేనన్ని వ్యాపకాలు! నువ్వే వ్రాస్తూండు. వీలయినప్పుడల్లా జవాబులిస్తా ననుకో... నా నుంచి జవాబు లేదని మాత్రం నువ్వు అలగొద్దు. మన స్నేహం కాంక్రీటు కన్నా గట్టిది. నానుంచి ఉత్తరాలు లేవని నువ్వు అలిగినా, నేను లక్ష్య పెట్టను. నాకు ఓటమి, అలకా రెండూ లేవుగా!" అన్నాడు.

దాదాపు ఆరేళ్ళ అనంతరం - అనుకోకుండా యీ ఉత్తరం! - "ఆ ఒక్కరోజు ఆనందంగా గడుపుదాం ఏం"

"ఆ ఒక్క రోజు ఆనందంగా గడుపుదాం. ఏం..."

వాడి ఉత్తరంలో చివరి వాక్యం పదే పదే గుర్తుకొచ్చి, నా మనసు ఒక్కలా చివుక్కుమంటూంది. వాడు బాగా కలిగినవాడు. నేను...నేను.. ఓ పూర్ ఎల్డీసీని! నెల నెలా చాలీ చాలని జీతం కాక, ఎంత పొదుపుగా వాడినా, సంసారాన్ని భారంగా యీదుతున్న వాడిని. నలభైయ్యేళ్ళకే ఎనభై యేళ్ళ వాడిలా నీరసంగా తిరుగుతూ, రేపటి గురించి ఆలోచించి ఆవేదన పడుతూ అనుక్షణం దిగులుతో కుంగిపోతున్న వాడిని.

నా ఒంటి నిండా నీరసం ఉంది. మా ఇంటి నిండా దరిద్రం ఉంది. మా మనసుల్లో భయం గూడు కట్టుకుని ఉంది. ఊరంతా అప్పు ఉంది.

ఈ పరిస్థితుల్లో - ఒక్క రోజే కావచ్చు - నా ఆత్మీయ స్నేహితుడికి ఆనందాన్ని ఎలా పంచి యివ్వ గలను? వాడుండేది కొన్ని గంటలే కావచ్చు,ఈ లోపలే నా అంతు లేని దరిద్రాన్నీ, పీల్చి పిప్పి చేస్తున్న సంసార బాధల్నీ వాడికి తెలియనిచ్చి, వాడి మనసుని వికలం చేయడం తప్ప తనేం చెయ్య గలడు? ఆకలితో అలమటిస్తున్న వాడు అన్న దానం

ఎలా చేయ గలడు? సంసార బాధలతో సతమతమవుతున్న నేను వాసుకి ఆనందాన్ని ఎలా యివ్వ గలను?

వాడు ఎయిర్ కండిషన్‌కి అలవాటు పడిన వాడు. నా కొంపలో గాలి చొరటానికి ఒక్క కిటికీ కూడా లేదు. వాడు టేబిల్ మీల్సుకి అలవాటు పడ్డ వాడు. సంసారం ప్రారంభించిన కొత్తలో యీ మూల ఓ పీట చెక్క ఉండాలి, ఏమయింది చెప్మా! వాడు వివిధ భారతి కార్యక్రమాలంటే చెవి కోసుకుంటాడు. ఒరే, కిష్టీ! నాన్నా నాగూ! కాస్త మీ సంగీతం ఆపండర్రా, వినలేక చెవులు బద్దలై పోతున్నాయి... నా కేడుపు వచ్చింది. బలవంతంగా ఆపుకున్నాను. భగవాన్! ఇంత అసమర్థుడిగా నన్నెందుకు పుట్టించావు తండ్రీ!

పార్వతి నా దగ్గరకొచ్చి నా చేతిలో ఉత్తరం తీసుకుంది. ఓ సారి చదివి, నిట్టూర్చి డ్రాయరు మీద ఉంచింది. డ్రాయరు మీద పుస్తకాలు సర్దుతూ అంది: "మీరు...మీరు.. మరోలా అనుకోనంటే...ఒక్క విషయం చెబుతాను..."

"చెప్పు" పార్వతి చెప్పింది. నేను అది విని బావురుమని ఏడవాలి. కానీ, నా అశక్తత నా కన్నీళ్ళని ఎప్పుడో ఆవిరి చేసింది. నేను చిన్నప్పుడెప్పుడూ స్కూల్లో నాటకాలు ఆడ లేదు. కాని ...ఇప్పుడు ఆడక తప్పడం లేదు. నా కోసం కాదు.. నా పరువు కాపాడు కోవాలనే ఉద్దేశం నాకు లేదు... నా వాసు కోసం! వాడు కోరుకున్న ఆనందాన్ని ఇవ్వడం కోసం!

అమ్మ పోయిందని కబురు వస్తే పార్వతి చెవి దుద్దులు అమ్మేసాను. అప్పట్లో మరో మార్గం లేక పోయింది. నాగుకి జబ్బు చేసి, పీకల మీదకి వస్తే బంగారు గాజు ఒకటి తాకట్టు పెట్టేను. దాన్ని బహుశా, యీ జన్మలో విడిపించుకో లేనేమో! రెండోది ఇప్పుడు, అమ్మ వలసి వస్తోంది.

లోకంలో ఉన్న ఏ మగాడూ నా అంత అసమర్థుడు కాదనిపిస్తోంది. లోకంలో ఉన్న ఏ ఆడదీ పార్వతి అంత మంచిది కాదనిపిస్తోంది. లోకంలో ఉన్న ఏ సంసారమూ మా అంత దరిద్రం అనుభవించడం లేదని పిస్తోంది!

ఆ సాయంత్రానికి నా చేతిలో ఈ సమస్యని ఎదుర్కో గలిగినంత డబ్బు వచ్చి పడింది, పార్వతి ధర్మమా అని! మా ప్రక్క వాటాలోని మూర్తి గారు నెల రోజులు సెలవుతో వాళ్ళ గ్రామం వెళ్ళడం వలన – వారి వాటా తాళాలు నా దగ్గిరే ఉన్నాయి. ఇంటాయన వచ్చి వెయిట్ వాషింగ్ చేయిస్తానని చెప్పడం వల్ల, మూర్తి గారు తమ ఇంటి తాళాలు నా చేతికి యిచ్చి వెళ్ళారు! ఇదీ ఒకందుకు మంచిదే అయింది. మూర్తి గారికి ఫేన్లూ, రేడియో కూడా ఉన్నాయి. ఆ వాటా తలుపులు తీసి, అంతా శుభ్రం చేయించాను. మా ఇల్లు కూడా నేనూ, పార్వతీ కలిసి శుభ్రంగా సర్దేము. భయంకరమైన రోగంతో, చాలా కాలం తీసుకుని, గుటుక్కు మన్న వ్యక్తి శవాన్ని చూసి, ఇంట్లో వాళ్ళు అంతరంగం అట్టడుగున పొందే రిలీఫ్ లాంటిది కలిగింది నాకు!

* * *

ఆదివారం.

బాబుకీ, పాపకీ ఉన్నంతలో కాస్త మంచి బట్టల్ని ఎంచి, ఉతికి ఆరేసి. ఇస్త్రీ చేయించి కట్టబెట్టింది పార్వతి. ముఖానికి కొత్తగా కొన్న పౌడరు రాసి, ముస్తాబు చేసింది. ముఖానికి పౌడరు రాస్తూ ఉంటే, కుప్పి గంతులు వేస్తూ, ఎప్పుడూ దాన్నెరుగ నట్టుగా వెర్రిగా ఆనందిస్తున్న పిల్లల్ని చూసి, నాగుండె తరుక్కు పోయింది. దు:ఖం గొంతు దగ్గరకి వచ్చి గర గరలాడింది. వీళ్ళకి – కనీసం పార్వతికయినా, నేనెప్పుడు అలంకరణ సామగ్రి కొన్నాను? కనీసం సినిమా అయినా చూపించానా! ఈ ద్వారానికి తల కొట్టుకుని చచ్చిపోతే! కానీ... కానీ... ఇవాళ రైల్లో నా ప్రాణం వస్తుంది. పార్వతి కూడా ఎప్పటి నుండో కట్టకుండా భద్రంగా దాచుకున్న పువ్వంచుల తెల్ల చీర కట్టుకుని, జడలో ఇన్ని మల్లెలు కూడా తురుముకుంది. నా కళ్ళు చెమర్చాయి. నాకు తెలుసు! పార్వతి మనసులో చాలా బాధ పడుతోంది. కాని, నా ఆనందం కోసం దాన్ని బయటకి వ్యక్తం చేయడం లేదు. భగవాన్! నాకేమీ ఇవ్వక పోయినా, ఇంత మంచి భార్యనిచ్చావు... చాలు..

రిక్షా చేయించుకుని, స్టేషనుకి వెళ్తున్నప్పుడు వీధిలో అంతా విచిత్రంగా చూసినప్పుడు, నా గుండె ఎవరో ఇనుప తొడుగులతో పిండి నట్లయింది. రైలొచ్చింది. ఫస్ట్ క్లాస్ కంపార్టు మెంటు వేపు పార్వతీ పిల్లలతో కదిలాను. వాసు దిగ లేదు. ఆత్రంగా అటూ ఇటూ చూసేను. రెండో తరగతి వేపు పరిగెత్తాను. అందులో ఉంటాడా! ఉహూ...! వాసు మొదటి తరగతికి తప్ప, మరి దేనికీ టిక్కెట్టు కొనడే! అయినా, అనుమానం పీకుతూ ఉంది. కంపార్టుమెంటులోనికి తొంగి చూసాను. వాసు కనిపించలేదు.

"ఏమండీ ఆయన వచ్చేరా!" "రాలేదు పార్వతీ!" "అంతా చూసారా?" "చూసేను."

వెర్రి నవ్వొకటి నవ్వేను. "లేదు... వాడు ఫస్టు క్లాసులో తప్ప ప్రయాణం చెయ్యడు... వెతకడం వృథా ప్రయాసే..." నిరాశగా పిల్లలతో కదిలి పోతూ ఉంటే, వెనుక నుండి చప్పట్లు విన వచ్చేయి. ఆత్రంగా వెనక్కి తిరిగి చూసాను. సామానుతో సహా మూడో తరగతి పెట్టె దగ్గర నించుని ఉన్నాడు వాసు! నాకు ఆశ్చర్యం వేసింది. భయం కూడా వేసింది. వాసు... వాసు... ఈ పెట్టె ఎక్కడవా! అదేమిటి! నిండు సూట్‌లో లేడేం? ఆ చేతికి వాచీ, ఉంగరం... ఏవీ లేవు! చవక రకం ముతక గుడ్డలలో ఎంత దీనంగా ఉన్నాడో!

నా గుండె చెరువయి పోతూంది. మెదడు బరువెక్కి పోతూంది. జూదానికి, తాగుడికి, స్త్రీ వ్యసనానికి ఖర్చు చేసి, ఆస్తి నంతటినీ హారతి కర్పూరంలా కరిగించేసిన వాళ్ళని నేనెరుగుదును. గుర్రప్పందాలలో చిత్తయి పోయిన ధనవంతులని నేను చూసాను... ఏవో గొడవలతో, వ్యాపారంలో నష్టం వచ్చి చితికి పోయిన వారూ నాకు తెలుసు. నా వాసు.. నా ప్రాణం... వాడు కూడా...! అయ్యో...! కదులుతూన్న రైలు కింద తల పెట్టాలని పించింది. కాని... నా ప్రాణం నన్ను కావలించు కోడానికి అల్లంత దూరంలో ఎదురు చూస్తోంది! గబ గబా వెళ్ళాను. వాసు నన్ను బలంగా వాటేసుకున్నాడు. ఆప్యాయంగా అరచెయ్యి నిమిరాడు. కళ్ళలో ప్రేమ కురిపించాడు. చేతలతో అమృతం చిలికించాడు. వాడి బలమైన కౌగిలిలో నాకు ఊపిరాడ్డం లేదు. నేను వాడి చేతులు తీయడానికి ప్రయత్నిస్తూ "ఉండు... ఉండు..." అన్నాను నెమ్మదిగా. వాసు నన్ను వదిలేసాడు. "చూసావా! నేనే గెలిచాను! నిన్నింకా వాటేసుకోవాలనే ఉంది. నువ్వే ఓడి పోయి, అపజయాన్ని అంగీకరించేవు." అన్నాడు, నవ్వి. నేనూ నవ్వేను.

ఆ తరువాత సామానులు టాక్సీలో సర్దించి, ఎక్కాము. పిల్లలు టాక్సీలో ఎగిరి గంతులు వేస్తూ ఉంటే – 'మంచి చలాకీగా ఉన్నారని వాసు భాష్యం చెప్పేడు. అది – వాళ్ళకి కొత్త వలన కలిగిన వింత సరదా అని వాసుకి ఎలా చెప్పను?! మధ్యాహ్నం భోజనాలప్పుడు రెండు మూడు స్పెషల్సుతో పార్వతి చేసిన వంటకాలని పిల్లలు ఆత్రంగా బొక్కుతూ ఉంటే, నాకు తగని సిగ్గనిపించింది. కన్న తండ్రిగా వాళ్ళ కెప్పుడు కడుపు నిండా పిండి వంటకాలతో పెట్ట గలిగాను? వాసు కబుర్లు చెబుతూ కూచున్నాడు. నన్నో విషయం మాత్రం అమితంగా కలవర పరుస్తూంది. వాసు ఇంత సామాన్యంగా, నిరాడంబరంగా ఉన్నాడేం! ఏ విపరీత పరిస్థితులలో వాడు ఇంత తక్కువ ఆర్థిక స్థితికి దిగజారి పోయేడు? రాజా లాగా భోగ భాగ్యాలతో తుల తూగుతూ 'వడ్డించిన విస్తరి నా జీవితం' అనేలా ఉండే నా వాసు – ఎంతగా కుంగి పోయేడు! నాకు ఆందోళన ఎక్కువవుతోంది. వాసుని అడగాలనిపించింది. కానీ, ఎందుకో అడగ లేక పోయేను. వాడు కూడా ఏమీ చెప్ప లేదు. వాడు మామూలుగానే ఉన్నాడు. అదంతా నటన కాదూ! నేనూ నటించి, వాడూ నటించి...ఏమిటో ఈ జీవితం! నా గుండె తరుక్కు పోతూంది. నాకేడు పొస్తోంది.

అన్యమనస్కంగానే వాడిని మూర్తి గారి వాటా లోకి తీసుకెళ్ళాను. ఫేను వేసి, రేడియో తిప్పి, వివిధ భారతి పెట్టాను. నాకు చాలా బాధగా ఉంది. నేను – వాసు ఆనందిస్తాడని, నేనేదో సుఖంగా ఉన్నానని డాబు కోసం నాటక మాడుతున్నాను. వాసుని చూడబోతే – వాడి పరిస్థితి ఇలా ఉంది! ఒక విధంగా వాడు బాధ పడతాడేమో! అనిపించింది. ఈ ఫేన్లూ, యీ రేడియో, ఈ పిండి వంటలూ, ఈ ఆడంబరాలూ చూసి , వాడు అసూయ పడడు కానీ... కానీ... ఎందుకో ఏదో లోపం కనిపించింది. ఇలా చేసి ఉండాల్సింది కాదేమో! చిరాకనిపించింది. కళ్ళలో నీళ్ళు తిరుగుతూ ఉంటే, ఆనంద బాష్పాలని సంజాయిషీ ఇచ్చుకున్నాను. చిన్న నాటి ముచ్చట్లు వాసు ఉత్సాహంగా చెప్పేడు. ఉత్సాహం తెచ్చుకుని నేనూ సంభాషణ సాగించాను.

ఆ సాయంత్రం పిల్లలకి బట్టలూ, బిస్కెట్లూ, బొమ్మలూ కొని పెట్టి, రైలుకి బయలు దేరాడు వాసు. నేను పార్వతినీ, పిల్లలనీ వెంటబెట్టుకుని వాసుని రైలెక్కించడానికి స్టేషనుకి టాక్సీలో వెళ్ళాను. వాసుని రైలెక్కించాక, వాడు కనుమరుగవుతూ ఉంటే ఏదోదిగులు నన్నావహించింది. రైలు కనుమరుగై పోయే వరకూ చూసి, ఆ తర్వాత రిక్షా మాట్లాడేను. పిల్లలు 'టాక్సీ... టాక్సీ...' అని గునుస్తూ వుంటే వాళ్ళని సమాధాన పరచ లేక పార్వతి సతమత మయిపోయింది.

ఇంటికి వస్తూనే మూర్తి గారి వాటా తలుపుల్ని, కసిగా దభాలున వేసి, తాళం బిగించాను. ఆ తాళం నన్ను వెక్కిరిస్తూ చాలా కబుర్లు చెప్పినట్లయింది.

* * *

వెళ్ళిపోయిన వారం రోజులకి వాసు నుంచి నాకు ఓ రిజిష్టరు కవరు వచ్చింది. అందులో ఉత్తరంతోపాటూ ఐదు వేలకి క్రాస్ చేసిన చెక్ ఉంది! నా చేతులు వణుకుతున్నాయి. ఉత్తరం చదివేను

"రామం,

"మన్నించు. నేను భ్రమించ లేదు. కానీ నువ్వు నన్ను భ్రమింపజేయడానికి ప్రయత్నించేవు. నీ గురించి ఎప్పటి కప్పుడు మన స్నేహితుడు రామ గోపాలం విశాఖ నుంచి తెలియ జేస్తూనే ఉన్నాడు. తీరిక చిక్కక నీకు నేను ఉత్తరాలు రాయడం లేదంతే! నేను అప్పటి వాసులాగా, డబ్బున్న వాడిలాగా మీ ఇంట్లో అడుగు పెట్టక పోవడానికి ఒక్కటే కారణం ఉంది. నీ ఆర్థిక స్థితి గతులు నేనెరుగుదును కనుక అలా రావాలనిపించింది. నా దగ్గర లక్షలు మూలుగుతున్నాయి... ఖరీదయిన వ్యక్తిలాగా నీ దగ్గరకి వస్తే.. ఎందుకో ఏమో... నువ్వు బాధ పడతావనిపించింది. ఈ వెర్రి ఆలోచనే నన్నలా నీ దగ్గరకి నిరాడంబరంగా వచ్చేలా చేసింది.

"ఇద్దరమూ తప్పే చేసాం. మన మైత్రీ బంధం మూలాల్ని మరిచి పోయి, ఒకర్నొకరు– ఒకరి వ్యక్తిత్వాన్ని మరొకరు కించపరుచుకునేలా ప్రవర్తించేం! అందుకే యిద్దరం ఒకర్నొకరం క్షమించేసుకుందాం. చెక్కు పంపిస్తున్నాను. కాదనకు. నేను జాలి పడి నీకు సాయం చేస్తున్నా ననుకో వద్దు.. మా చెల్లెమ్మకి యిది పుట్టింటి కానుక. ఆడ పిల్ల కెవరయినా, ఎంతయినా పెట్టొచ్చని మా అమ్మ చెప్పేది.

"నన్ను అర్థించిన వాళ్ళందరికీ నాకు కలిగింది యిస్తున్నాను. నిన్ను మాత్రం దీన్ని తీసుకోమని అర్థిస్తున్నాను. నన్ను క్షమించమని మరో సారి ప్రార్థిస్తున్నాను.

"ఈ చెక్కు నువ్వు అంగీకరించక పోతే... వాసు నీకు అక్కర లేనట్టే భావిస్తాను. ఉంటాను.

ఎప్పటికీ, నీ,

వాసు.

చేతిలో ఉత్తరం నా కన్నీళ్ళతో తడిసి పోయి, ముద్దగా తయారయింది. వణుకుతున్న పెదిమలని గట్టిగా అదిమి పెట్టి, మనసులో అనుకున్నాను: "నువ్వే గెలిచావు, వాసూ! ఇప్పుడూ, ఎప్పుడూ గెలుపు నీదే!" అని.

* * *

*ఆంధ్ర ప్రభ సచిత్ర వార పత్రిక, జన్మ దిన ప్రత్యేక సంచిక 20 -8 -1961 సంచికలో ప్రచురణ.*